క్లుప్తంగా

వేడుకగా బ్రహ్మోత్సవాలు



విజయవాడ కల్చరల్: కంచికామకోటి పీఠం, శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. సోమవారం నాటి కార్యక్రమాలు ఉదయం భేరీ పూజతో ప్రారంభమయ్యాయి. భేరీ తాండవం, ఆలయ బలి నిర్వహణ, గ్రామబలిదానం, అఖిల గద్య, పద్య పూర్వక ధ్వజారోహణం, ధ్వజదేవర్చన, నవ కుంభారోహణ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ నిర్వాహక సంఘ సభ్యులు, మాగంటి వేణుగోపాల శర్మ, పాలక మండలి సభ్యులు ఎ.ప్రభాకర శర్మ, మేనేజర్ శర్మ పాల్గొన్నారు.

విద్యార్థులు చేసిన నమూనాలు అద్భుతం



పాయకాపురం(విజయవాడరూరల్): కాంతి పాఠ్యాంశంలో కఠినంగా విభావిస్తున్న దూర దృష్టి హ్రాశ్వదృష్టి అనే కంటి దోషాలను సులభంగా నేర్చుకోవడానికి చెక్కలు, కర్రలతో తయారు చేసిన నమూనాలు అద్భుతంగా ఉన్నాయని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్లో అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా విద్యార్థులు చేసిన ప్రయోగాలు, పరిశోధనలు, నమూనాల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి హుస్సేన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు



విజయవాడకల్చరల్: కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో దసరా మహోత్సవాల సందర్భంగా సత్యనారాయణపురంలోని సీతా రామా కల్యాణ మండపంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. భారతీయ భారతీ స్కూల్ ఆఫ్ ఫైన్ఆర్ట్స్ నిర్వాహకుడు పద్మశ్రీ హేమంత్ ఆధ్వర్యంలో చిన్నారులు కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. నాట్యాచార్యుడు మాగలూరి త్రినాథాచారి బృందం చిన్నారులు అన్నమయ్య, రామదాసు, త్యాగరాజస్వామి కీర్తనలకు నృత్యాలను అభినయించారు. నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులకు ప్రశంశా పత్రాలను నిర్వాహకులు అందజేశారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం శ్రీధర్మ పరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పుష్పనళిని బృందం చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను రంజింపజేశాయి. అనంతరం చిన్నారులకు నిర్వాహకులు జ్ఞాపికలు అందజేశారు.

మధురంగా అన్నమయ్య సంకీర్తనం



విజయవాడకల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, సునీల్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో దసరా మహోత్సవాల సందర్భంగా గాంధీనగర్ హనుమంత రాయ గ్రంథాలయంలో సినీ సంగీత విభావరి, అన్నమయ్య సంకీర్తనం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. యువ సంగీత కళాకారులు రుగ్వేదం పద్మశ్రీ, కృష్ణశ్రీలు పలు అన్నమయ్య సంకీర్తనలు మధురంగా ఆలపించారు. తెలుగు, హిందీ చిత్రగీతాలను సునీల్ కుమార్, రామభద్రకుమార్, శ్రీనివాసరావు, రేష్మలు ఆలపించారు.

రెండోరోజు షిర్డీ సాయినాథ పుణ్యతిథి


మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో సాయినాథుని 105వ పుణ్యతిథి మహోత్సవాలు సోమవారం రెండోరోజుకు చేరాయి. గోక్షీరం, పెరుగుతో బాబాకు అభిషేకం చేసి మారేడు దళాలతో లక్షనామార్చన జరిగింది. భక్తులు బాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ కమిటీ కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, ప్రచార కార్యదర్శి శ్రీనివాసరావు, యాదల శ్రీనివాసరావు, కమ్మిలి రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీదేవి... నమోస్తుతే...

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



అలంకారంలో అన్నపూర్ణాదేవి



శివరామకృష్ణ క్షేత్రంలో గాయత్రి మాత



బావాజీపేటలో శ్రీ గాయత్రీదేవిగా అమ్మవారు



లబ్బీపేట శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో గాయత్రి మాత

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు సోమవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఆధ్మాతిక వాడగా విరాజిల్లుతున్న విజయవాడ నగరంలోని పలు దేవాలయాల్లో అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో పూజలు అందుకున్నారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో.....

అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం లలితాత్రిపుర సుందరీదేవి అలంకారంలో పూజలు చేశారు. సామూహిక కుంకుమపూజలు, శ్రీలలితా సహస్రనామ పారాయణం జరిగింది.

రామలింగేశ్వరపేటలో......

రామలింగేశ్వరపేట శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని శ్రీగాయత్రీదేవిగా అలంకారం చేసి పూజలు నిర్వహించారు.

ముత్యాలంపాడులో....

స్థానిక ముత్యాలంపాడులోని శ్రీ పార్వతీసమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారు గాయత్రీ దేవిగా పూజలు అందుకున్నారు.

బావాజీపేటలో.....

బావాజీపేట నాలుగో లైనులో శ్రీ దేవి ధర్మప్రచార పరిషత్ పర్యవేక్షణలో శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్ సభ్యురాలు బచ్చు మాధవీకృష్ణ ఆధ్వర్యాన అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి కుంకుమార్చనలు నిర్వహించారు.

వేదమాతా నమోస్తుతే....

విజయవాడ కల్చరల్: వేదాలకు అధిదేవత, సర్వపాపాలను అహరించే శక్తి స్వరూపిణి గాయత్రీ మాత దసరా మహోత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారిని గాయత్రీ మాతగా అలంకరించి పూజలు నిర్వహించారు. విశ్వమాతా చారిటబుల్ సంస్థ, సిద్ధేశ్వరీపీఠం కుర్తాళ పీఠం ఆధ్వర్యంలో హనుమాన్‌పేటలోని శంకరమఠంలో అమ్మవారిని గాయత్రి మాతగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉదయం చండీహోమం. సహస్రగాయత్రీ మహామంత్రం, చతుర్వేద పారాయణ నిర్వహించారు. సినీ నిర్మాత సీ కల్యాణ్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు కల్యాణ్ కుటుంబ సభ్యులను సత్కరించారు. కంచికామకోటి పీఠం ఆధ్వర్యంలో లబ్బీపేట శ్రీ శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో పార్వతీ దేవిని గాయత్రి మాతకగా పూజలు అందుకుంది. టీటీడీ వేదపండితులు వేద సభను నిర్వహించారు.

దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో త్రిశ క్తులకు పూజలు నిర్వహించారు. బాలత్రిపుర సుందరిని గాయత్రి మాతగానూ,శారదాంబను హంస వాహన బ్రాహ్మిగానూ ,మహాలక్ష్మిని మహాలక్ష్మీ గానూపూజలు అందుకుంది.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విస్తత విశేష జ్ఞాన పీఠిక... ఓం శ్రీగాయత్రీదేవీ... నమోస్తుతే... అంటూ భక్తులు అమ్మవారికి వైభవోపేతంగా పూజలు జరిపారు. శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండోరోజు అమ్మవారు శ్రీగాయత్రీదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు.

న్యూరాజరాజేశ్వరీపేటలో

న్యూరాజరాజేశ్వరీపేటలో చేపట్టిన దేవీశరన్నవ రాత్రి మహోత్సవాల్లో శ్రీగాయత్రీదేవీ అమ్మవారి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాసప్తశతీ చండీ హవనం(హోమం), లలితా సహస్ర నామార్చనతో కుంకుమపూజలు, పంచహారతులు, ప్రసాద వితరణలు నిర్వహించారు.



శివకామేశ్వరీ పీఠంలో శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు

సింగ్‌నగర్ 58వ డివిజన్‌లో

సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని శ్రీషిర్డీ సాయి మందిరంలో వేంచేసి ఉన్న శ్రీకాశీ అన్నపూర్ణ అమ్మవారు శ్రీగాయత్రీదవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి మహాన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకం, లలితా సహస్ర పారాయణం జరిగింది.

బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో అన్నపూర్ణాదేవి

సత్యనారాయణపురం (విజయవాడ సెంట్రల్): దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా స్థానిక సత్యనారాయణపురంలో కొలువైయున్న కాశీ అన్నపూర్ణదేవి సోమవారం బాల త్రిపుర సుందరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు కుటుంబ సభ్యులతో కలసి ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితుల సమక్షంలో నిర్వహించిన కుంకుమ పూజ, చండీహోమంలో దంపుతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి కె. సుపద్మాదేవి, ధర్మకర్తల మండలి చైర్మన్ కొల్లూరు రామకృష్ణ మాట్లాడుతూ దసరా మహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మహోత్సవాలు తొమ్మిది రోజులు అమ్మవారు అనేక అలంకారాలతో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సాయంత్రం దేవస్థాన ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.



న్యూఆర్ఆర్‌పేటలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు.

క్రీడల్లో ప్రావీణ్యం పెంపొందించుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు విద్యకే పరిమితం కాకుండా క్రీడల్లో ప్రావీణ్యం పెంపొందించుకోవాలని అమలి స్కూల్ హెచ్ఎం సిస్టర్ రాజకుమారి పిలుపునిచ్చారు. స్థానిక ముత్యాలంపాడు అమలి హైస్కూల్‌లో తైక్వాండో పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థుల అభినందన కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు ఎ.శ్రీహాస్య జిల్లాస్థాయి అండర్-14 విభాగంలో, అండర్-11 విభాగంలో శ్రీహిత, యోగ్యశ్రీ బంగారు పతకాలు సాధించగా, ఎస్కే అమీనాబీ సిల్వర్ మెడల్ సాధించడం పాఠశాలకు గర్వకారణమన్నారు. అలాగే చలమలశెట్టి మోక్షిత్ కన్సొలేషన్ బహుమతి సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ అర్జా వెంకటేశ్వరరావు, కోచ్ అంకమ్మ రావు తదితరులు విద్యార్థులను అభినందించారు.



విజేతలతో పాఠశాల హెచ్ఎం రాజకుమారి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్లు మరమ్మతుల దృష్ట్యా సీతారామపురం సబ్‌స్టేషన్, 11కేవీ సూర్యారావుపేట ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 8.30 నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీ ఈఈ బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గాఅగ్రహారం కాలువగట్టు, సీతారామపురం వీఎంసీ డ్రైనేజీ, కొత్తవంతెన రోడ్డు, జనతాప్రెస్ రోడ్, కాట్రగడ్డ వారివీధి, అంకమ్మతల్లి టెంపుల్ ఏరియా, దాసరి వారివీధి, సూర్యనారాయణ వీధి, జడగంవారివీధి, వేమూరివారివీధి, ఏలూరురోడ్డు, ఆంజనేయస్వామిటెంపుల్ ఏరియా,డోర్నకల్‌రోడ్డు, వీధిరాజుమేడ ఏరియా, గోపరాజురామచంద్రరావు రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



వైభవంగా దసరా ఉత్సవాలు

ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు అయిన సోమవారం పెద్ద సంఖ్యలో భక్తులు దుర్గమ్మను దర్శించుకున్నారు. భక్తులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించారు. ఎక్కడా ఏ విధమైన ఇబ్బందులు లేకుండా కట్టుదట్టమైన చర్యలు తీసుకుంటున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ











దుర్గమ్మ సన్నిధిలో రిటైర్డ్ జస్టిస్ బి .శివశంకర్

ప్రజారోగ్యానికి రక్ష.. 'జగనన్న ఆరోగ్య సురక్ష'

- ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- బిషప్ అజరయ్య పాఠశాలలో మెగా ఆరోగ్య మేళా



మాట్లాడుతున్న సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పక్కన కార్పొరేటర్ కుక్కల అనిత

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజారోగ్య రంగంలో కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గిరిపురం బిషప్ అజరయ్య పాఠశాలలో సోమవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష మెగా ఆరోగ్య మేళాలను స్థానిక 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత రమేష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరంలో అందుతున్న వైద్య సేవలతో పాటు బీపీ, నేత్ర పరీక్షల విధానాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా అద్భుతమైన స్పందన లభిస్తుందని చెప్పారు. ముందస్తు సమాచారం ఇచ్చి శిబిరాలు నిర్వహిస్తుండటంతో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని సద్వినియోగం చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇంటి వద్దే 7 రకాల వైద్య పరీక్షలు నిర్వహించడం ద్వారా అనారోగ్య సమస్యల్ని గుర్తించి వారికి 5 దశల్లో ఉచితంగా ఆరోగ్య సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. కాగా 88 వార్డు సచివాలయం పరిధిలో 1,036 కుటుంబాలకు సంబంధించి 2999 మందిని వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది కలిసినట్లు తెలిపారు. వీరందరికీ 4,286 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి.. 432 టోకెన్లు అందజేసినట్లు పేర్కొన్నారు. వారికి ఆరోగ్య మేళాలో స్పెషలిస్ట్ డాక్టర్లతో చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు ప్రతిఒక్కరూ ఆరోగ్యశ్రీ యాప్ ను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా ప్రభుత్వ సేవలు పొందడం సులభతరం అవుతుందని మల్లాది విష్ణు తెలిపారు. అత్యవసర సమయాల్లో ఇబ్బందులకు గురికాకుండా నెట్ వర్క్ ఆస్పత్రులలో ఆరోగ్య మిత్రల సేవలను వినియోగించుకోవాలన్నారు. అలాగే అర్ధ రాత్రి సమయంలోనూ ముగ్గురు పర్యవేక్షకులను ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిందని.. వారి నెంబర్లను క్యాంపుల వద్ద ప్రదర్శించడం జరుగుతుందని తెలియజేశారు. ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకుని ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, గైనకాలజీ నిపుణులతో పాటు, ఇద్దరు వైద్యాధికారులు పాల్గొని పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ మాధవి, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఇంటా సంక్షేమం వెల్లివిరుస్తోందని, నిరుపేద కుటుంబాలకు భరోసా కల్పించిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 32వ డివిజన్ పరిధిలో సోమవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కోఆప్షన్ సభ్యురాలు గుండె సుభాషిణితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించామని పేర్కొన్నారు.

10ఏళ్ల కాల పరిమితి దాటిన ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్..

10ఏళ్ల కాల పరిమితి దాటిన ఇళ్ల పట్టాలకు జీవో నెం.55 ద్వారా రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని మల్లాది విష్ణు తెలిపారు. అలాగే అర్బన్ ల్యాండ్ సీలింగ్ జీవో నెం.84 ప్రకారం 150గజాల లోపు ఉచితంగా రెగ్యులరైజేషన్ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం పలు కుటుంబాలకు మంజూరైన నూతన రేషన్ కార్డులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుండె సుందర్‌పాల్, ఒగ్గు గవాస్కర్, పేరం త్రివేణిరెడ్డి, శ్యామ్, పోతిరెడ్డి, పెద్దిరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



32వ డివిజన్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే విష్ణు

దసరా మహోత్సవాలను పర్యవేక్షించిన సీపీ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం పోలీస్ కమిషనర్ టీకే రాణా భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. కనకదుర్గానగర్, ప్రసాదం కౌంటర్లు, అన్న ప్రసాద వితరణ ప్రదేశాలలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు, సిబ్బందికి ఎటువంటి పొరపాట్లు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా అందరికీ అమ్మవారి దర్శనం జరగాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్త్ నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడకుండా అమ్మవారిని దర్శనం చేసుకోవాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలీస్ సేవాదల్ సిబ్బంది సేవా దృక్పథంతో సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీపీతో పాటు డీసీపీ విశాల్ గున్ని, ఏఐజీ ఎం.రవీంద్ర బాబు, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



భద్రత ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న సీపీ టీకే రాణా

పారిశుద్ధ్య పనుల పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): దసరా ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. శనీశ్వర స్వామి ఆలయం, ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగువన, నగరపాలక సంస్థ కార్యాలయం ముందు ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన టెంట్ల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. దసరా ఉత్సవాల్లో పారిశుద్య సిబ్బంది మూడు షిఫ్టుల్లో నిరంతరం విధులు నిర్వహించాలని, మరుగుదొడ్లు, ఆలయ పరిసర ప్రాంతాలు, రోడ్లు, క్యూ లైన్ లు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఉత్సవాల్లో వీఎంసీ నుంచి విధులు నిర్వహించే సిబ్బందికి సకాలంలో అల్పాహారం, భోజనాలను అందించాలని లేనిపక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాగు నీరు పంపిణీ పాయింట్‌లను పరిశీలించి నిరంతరం క్యూలైన్లలో ఉన్న భక్తులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. హోల్డింగ్ ఏరియా, బస్టాండు దగ్గర ఉన్న తాత్కాలిక మొబైల్ టాయిలెట్లను పరిశీలించి మరుగుదొడ్లను పరిశుభ్రంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన టాయిలెట్లకు నిరంతర నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉత్సవాలకు మంగళవారం నుంచి అధిక మొత్తంలో భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఆయా ప్రాంతాల్లో విధులను నిర్దేశించిన వారంతా నిరంతర పర్యవేక్షణలో సిబ్బందిని అప్రమత్తం చేస్తూ భక్తులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని కోరారు. పర్యటనలో సబ్ కలెక్టర్ అదితి సింగ్, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ ఇంజినీర్ యం.ప్రభాకర్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, జోనల్ కమిషనర్ -1 డాక్టర్ రవిచంద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, హెల్త్ ఆఫీసర్-3 ఇక్బాల్ హుస్సేన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



దుర్గాఘాట్ ప్రవేశం వద్ద పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితి సింగ్

జీడీసీ అకౌంటెంట్‌గా మంజుబాబు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): ప్రభుత్వ దంత వైద్య కళాశాల అడ్మినిస్ట్రేషన్ విభాగం అకౌంటెంట్ (కార్యాలయ సూపరింటెండెంట్)గా జి. మంజు బాబు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో సోమవారం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్రదీప్‌కు జాయినింగ్ రిపోర్టు అందచేశారు. ఇప్పటి వరకూ మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రిలో అకౌంటెంట్‌గా పనిచేశారు. గతంలో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో దీర్ఘకాలం పాటు పనిచేసి, మంచి వర్కర్‌గా గుర్తింపు పొందారు. బదిలీలో భాగంగా విజయవాడ ప్రభుత్వ దంత వైద్య కళాశాలకు వచ్చారు. ఆయనను కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి మేరీరత్నం, హెడ్‌నర్సు శివలీల తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.